బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ | మంగళవారం జూన్ 16 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

తెలంగాణలో 19 నుంచి భారీ వర్షాలు

అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతా ధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరమని వారికి స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణెళి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

మెట్రో విస్తరణను
అడ్డుకుంటున్నది బీజేపీనే

- **సీఎం రేవంత్ రెడ్డి**
- **కిషన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు.. కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపణ**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి వ్యవహార శైలే ఇందుకు కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అవసరమైన ప్రాంతాలకు మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు.హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయి రవాణా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో మెట్రో ప్రాజెక్టు ప్రారంభమైనప్పటికీ, రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మెట్రో నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు.

ఎల్‌అండ్‌టీ ఆర్థిక ఇబ్బందులు

మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర అనుమతుల కోసం ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించిందని సీఎం తెలిపారు. అయితే ప్రతి ఏడాది సుమారు రూ.400 కోట్ల నష్టం వస్తోందని ఎల్‌అండ్‌టీ పేర్కొనడంతో, ఆర్థిక ఇబ్బందుల కారణంగా విస్తరణకు సంస్థ ముందుకు రాలేదన్నారు.రూ.30 వేల కోట్ల విలువైన ఎల్‌అండ్‌టీ ఆస్తులను ప్రభుత్వం రూ.15 వేల కోట్లకు కొనుగోలు చేసిందని, ప్రస్తుతం సంస్థపై రూ.13,600 కోట్ల రుణభారం ఉందని వెల్లడించారు. తక్కువ వడ్డీతో రుణాలు సమీకరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

ఐఆర్ఎఫ్‌సీ ద్వారా ఎల్‌అండ్‌టీకి 4 శాతం వడ్డీతో రూ.13,600 కోట్ల రుణం అందేలా చర్యలు తీసుకున్నప్పటికీ, ఆ ప్రక్రియకు ఆటంకాలు సృష్టించారని సీఎం ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వ హామీ ఉన్నప్పటికీ రుణం విడుదల కాలేదని, దీనికి కిషన్‌రెడ్డి కారణమని విమర్శించారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు కేంద్రం వద్దే నిలిచిపోయిందని, ఇతర రాష్ట్రాల మెట్రో ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చి హైదరాబాద్‌కు మాత్రం నిరాకరించడం వివక్షకు నిదర్శనమని అన్నారు. అహ్మదాబాద్, విశాఖపట్నం మెట్రోలకు అనుమతులు లభించగా హైదరాబాద్‌కు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తోందని సీఎం మండిపడ్డారు. ప్రజా రవాణా వినియోగాన్ని పెంచాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిస్తూనే, మెట్రో విస్తరణకు సహకరించకపోవడం విరుద్ధమని వ్యాఖ్యానించారు.రాజీనామా చేయాలంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై స్పందించిన సీఎం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ప్రధాని మోదీ రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి కుటుంబ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీలు అమలు కాలేదని గుర్తు చేశారు.

హైదరాబాద్ ప్రాంత అభివృద్ధికి సంబంధించి ప్రకటించిన పలు ప్రాజెక్టులు ఇంకా కార్యరూపం దాల్చలేదని పేర్కొన్న ఆయన, కేంద్రం తన హామీలపై బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఆరోపణలు పక్కనపెట్టి తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులకు సహకరించాలని కేంద్రాన్ని కోరారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం

కొన్ని విభాగాలు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేక పోయాయి

అన్ని శాఖలు చేపట్టిన కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి

గ్రామాల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మీడియా, డిజిటల్ మీడియా ద్వారా చేసిన పనులకు ప్రాచుర్యం

క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు

ప్రగతి ప్రణాళికపై సచివాలయంలో సీఎం రేవంత్ సమీక్ష

వివరాలు 2వ పేజీలో

ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్

ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు

బలగం టీవి, వాషింగ్టన్

పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమా సియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ

డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం.

మిగితా 2వ పేజీలో

ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

- **మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది**
- **కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల**
- **జొన్నమొక్కజొన్నలను ఎంఎస్‌పి పరిధిలోకి తేవాలని డిమాండ్**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస ధరలు వస్తాయని ఆశగా సాగు చేసిన రైతులకు న్యాయం జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, రవాణా ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికైనా సేకరించిన పంటలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన

మిగితా 2వ పేజీలో

పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బీజేపీ

బీజేపీ కుట్రలో పావుగా మారిన పవన్

ఇష్టం వచ్చినట్లు తెలంగాణపై మాట్లాడితే ఊరుకోం

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పవన్ కళ్యాణ్ పదే పదే తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజకీయాల్లో విచ్చలవిడిగా మాట్లాడటానికి ఇదేమీ సినిమా కాదని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంపై, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలపై కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ స్వతహాగా మాట్లాడడం లేదన్నారు. కేంద్రంలోని మోడీ, ఇతర బీజేపీ నేతలు కించపరిచేలా స్క్రిప్ట్ ఇస్తే, దాని ప్రకారం పవన్ మాట్లాడుతున్నారు. ఆయన పూర్తిగా బీజేపీ ఆడించే తోలుబొమ్మలా మారిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావాన్ని, రాష్ట్ర విభజనను పవన్ కళ్యాణ్ వ్యతిరేకిస్తూ మాట్లాడటం కొత్తేమీ కాదని, గతంలోనూ మోడీతో సహా బీజేపీ నేతలు ఇదే తరహాలో తెలంగాణను అవమానించారని గుర్తుచేశారు. ఎంతో మంది యువకులు ప్రాణత్యాగం చేస్తే, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేశారని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారు? ఏ సినిమాలో నటిస్తున్నారు? అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమంటే సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులువు కాదని.. నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాల చరిత్రను పవన్ శ్రద్ధగా చదువుకుంటే మంచిదని

మిగితా 2వ పేజీలో

మెట్రో ఫేజ్-2 సాధించడంలో సీఎం విఫలం

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ (ఫేజ్-2) ప్రాజెక్టుకు కేంద్ర అనుమతులు సాధించడంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తన అసమ ర్థతను కప్పిపుచ్చుకునేందుకే సీఎం అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రతిపక్షాలపై నిందలు మోపుతున్నారని ఆరోపించారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కేటీఆర్ మాట్లాడుతూ, యూపీ, అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు మెట్రో ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇస్తున్నప్పటికీ, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకురాలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మెట్రో రెండో దశకు అనుమతి రాకపోవడం రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనేకసార్లు ఢిల్లీకి వెళ్లినప్పటికీ కేంద్రాన్ని ఒప్పించలేకపోవడం సీఎం చేతకానితనాన్ని వెల్లడిస్తోందని విమర్శించారు.

హైదరాబాద్ మెట్రో ఘనత కేసీఆర్‌దే

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తి కావడంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక పాత్ర పోషించారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మెట్రో పనులు మందగించినప్పటికీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు వేగవంతమైందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఆరు కారిడార్లు, 72 స్టేషన్లతో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో ఫేజ్-2 ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్గాలపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

మెట్రో ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న ఎల్‌అండ్‌టీ సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సంస్థను ఇబ్బందులకు గురిచేసి మెట్రో ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. మెట్రో ప్రాజెక్టు భవిష్యత్తును రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పణంగా పెట్టొద్దని ఆయన సూచించారు. మెట్రో ఫేజ్-2 విషయంలో కేంద్ర అనుమతులు సాధించడంలో విఫలమైనందుకు సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, అనుమతులు తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని, రాజకీయ విమర్శలకు బదులుగా అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని కేటీఆర్ పేర్కొన్నారు.

కేరళలో నిఫా వైరస్ కలకలం

- **కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ నిర్ధారణ**
- **మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స**
- **వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం**
- **కేరళలో వైరస్ భయంతో అప్రమత్తం అయిన తమిళనాడు**

బలగం టీవి, తిరువనంతపురం

దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్ లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పూణెళిలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని

గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్ కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది

మిగితా 2వ పేజీలో

నగరశివారులో డ్రగ్స్ తయారీ గుట్టు రట్టు

ముఠాను వలపన్ని పట్టుకున్న ఈగిల్ టీమ్

వివరాలు 2వ పేజీలో

కాక్రోచ్ జనతా పార్టీ ధర్నాలో అనూహ్య ఘటన

అభిజిత్ దీప్కేపై దాడి..చెంపపై కొట్టిన దుండగులు

దుండగులను చితక్కొట్టిన కార్యకర్తలు

బలగం టీవి, జైపూర్

నీట్, సీబీఎస్ఈ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా రాజస్థాన్ జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన ధర్నాలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. గుర్తు తెలియని దుండగులు అతడిని చెంపపై కొట్టారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు దుండగులపై ఎదురు దాడి చేశారు. తనపై దాడి చేసిన వ్యక్తిని కొట్టొద్దని దీప్కే కోరినప్పటికీ సీజేపీ కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. దుండగులను చితకబాదారు. ఈ ఘటనతో ధర్నాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అభిజిత్?ను అక్కడి నుంచి తరలించారు. కాక్రోచ్ పార్టీ చీఫ్?పై దాడి జరిగిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. అభిజిత్ దీప్కేపై దాడిని నెటిజన్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తోన్న వారిపై భౌతిక దాడులు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభిజిత్ పై దాడి చేసిన వ్యక్తులు ఎవరనే విషయం తెలియాల్సి ఉంది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్సీ వంటి ప్రధాన పరీక్షలలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగానే సోమవారం (జూన్ 15) రాజస్థాన్ రాజధాని జైపూర్?లో సీజేపీ ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే హాజరై ప్రసంగించారు. అనుహ్యంగా ఈ ధర్నాలో ఆయనపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు

సుందర్ పిచాయ్‌కు చేదు అనుభవం

స్టాన్‌ఫోర్ట్ వర్సిటీలో ప్రసంగిస్తుండగా విద్యార్థుల నిరసన

ప్రసంగాన్ని బయకాట్ చేస్తూ వెళ్లిపోయిన విద్యార్థులు

బలగం టీవి, శాన్‌ఫ్రాన్సిస్కో

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు చేదు అనుభవం ఎదురైంది . ఆయన ప్రసంగించేందుకు వేదిక పైకి రాగానే పలువురు స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులు వాకౌట్ చేశారు. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ వ్యతిరేకత వ్యక్తమైంది. ఇజ్రాయెల్ ప్రభుత్వంతో గూగుల్‌కు ఉన్న ఒప్పందాన్ని నిరసిస్తూ పాలస్తీనాకు మద్దతుగా వారంతా వేదిక వద్ద నుంచి వెళ్లిపోయారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఈ నిరసనకు

బాల్య వివాహాల నివారణకు చర్యలు

తరుణి స్వచ్ఛంద సంస్థతో ప్రభుత్వం అవగాహన

రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామన్న సీతక్క

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బాల్య వివాహాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ – తరుణి స్వచ్ఛంద సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమం మంత్రి సీతక్క సమక్షంలో జరిగింది.

మిగితా 2వ పేజీలో

నేలవిడిచి సాము చేస్తున్న ప్రాంతీయ పార్టీలు !

బలగం టీవి, హైదరాబాద్

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అణకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు

కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనులు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమచిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

చిన్నారిపై కోతుల మంద దాడి

గాయపడ్డ చిన్నారి ఆస్పత్రికి తరలింపు

బలగం టీవి, రాజన్న సిరిసిల్ల

జిల్లాలో కోతులు బీభత్సం సృష్టించాయి.ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ళ చిన్నారిపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో కోతులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని బొప్పాపూర్ లో ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ళ చిన్నారి అన్విక‌పై దాడికి చేశాయి. కోతులు దాడి చేసే సమయంలో చిన్నారి అన్విక కేకలు విని వెంటనే తల్లి కోతులను తరిమికొట్టింది . కోతుల దాడిలో అంవికకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడదతో భయాందోళనకు గురవుతున్నామని అంటున్నారు గ్రామస్తులు. కోతుల సమస్యపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు గ్రామస్తులు. చిన్నారులు బయట ఆడుకోవాలంటే భయపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బీజేపీ

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

హితవు పలికారు. ప్రధాని మోడీ ఇవాళ రాకెట్ల ముందు నిలబడి ఫోటోలు దిగుతున్నారంటే, ఆ అంతరిక్ష రంగానికి పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ చాలా పెద్ద హీరో కావడానికి తెలంగాణ ప్రజలు కూడా కారణమని, ఇక్కడి ప్రేక్షకులు చూడబట్టే ఆయన సినిమాలు ఆడాయనే విషయాన్ని మరువరాదని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌కు అక్కడ చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదు, ఆ విషయంలో ఆయన చాలా చిన్నవాడు. అధికారం ఉందని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. రెండు రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ములుగా కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని, కానీ తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని మహేష్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందని.. ఏపీ సైతం మన వైపు చూసేలా ఇక్కడ పరిపాలన ఉందన్నారు. అయితే, తెలంగాణను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ ఇంతలా మాట్లాడుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. వీరి మౌనం వెనుక బీజేపీ, బీఆర్ఎస్, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టంగా అర్థమవుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

సుందర్ పిచాయ్‌కు చేదు అనుభవం

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిపోయారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ప్రాజెక్ట్ నింబస్ కారణం. ఇజ్రాయెల్, గూగుల్, అమెజాన్ మధ్య కుదిరిన ఈ క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కాంట్రాక్ట్ విలువ 1.2 బిలియన్ డాలర్లు. గాజాలో ఘర్షణ విషయంలో ఇజ్రాయెల్ ప్రభుత్వ కార్యకలాపాలకు ఈ ప్రాజెక్ట్‌తో ప్రయోజనం లభిస్తోందని స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వారం ముందే వాకౌట్ గురించి ప్రకటన చేశారు. అయితే స్నాతకోత్సవ ప్రసంగంలో ఇతర స్పీకర్స్‌లానే పిచాయ్ ఏఐ గురించి ప్రస్తావించకపోయినా.. వ్యతిరేకతను మాత్రం ఎదుర్కొన్నారు. పలువురు విద్యార్థులు వేదిక వద్ద నుంచి వెళ్లిపోతున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. కాగా.. తన ప్రసంగాన్ని కొనసాగించిన పిచాయ్ స్టాన్‌ఫోర్డ్‌లో తాను చదివిన రోజుల్ని గుర్తుచేసుకున్నారు. ఆశావహ దృక్పథం అవసరాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రతీ తరం తమదైన రీతిలో కష్టాలను ఎదుర్కొందన్న విషయాన్ని గుర్తుచేశారు. 'మనం డిగ్రీలు తీసుకొని ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత అదెలా ఉండాలో మనం ఎంచుకోలేం. కానీ, పరిస్థితులను ఎలా అర్థం చేసుకోవాలనేది మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది' అని విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల వాకౌట్ గురించి ఆయనకు ప్రశ్న ఎదురైంది. అయితే ఆ ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు పిచాయ్ ఆసక్తి చూపలేదు. ఈ నిరసన దృశ్యాలను ఎక్స్ వేదికగా షేర్ చేసిన భాజపా కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి ప్రవర్తన మూర్ఖత్వానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. విజయవంతమైన టెక్ దిగ్గజం, స్టాన్‌ఫోర్డ్ పూర్వ విద్యార్థి అయిన పిచాయ్ అమూల్యమైన ప్రసంగాన్ని వినే అవకాశాన్ని కోల్పోయారని అసంతృప్తి వ్యక్తంచేశారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం

- కొన్ని విభాగాలు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేక పోయాయి
- అన్ని శాఖలు చేపట్టిన కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి
- గామాల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మీడియా, డిజిటల్ మీడియా ద్వారా చేసిన పనులకు ప్రాచుర్యం
- క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు
- పగతి ప్రణాళికపై సచివాలయంలో సీఎం రేవంత్ సమీక్ష

బలగం టీవి, హైదరాబాద్

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేక పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 9 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన

కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండెన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు.

తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు.క్ష్మీజ్యసభ ఎంపీ వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ కోసం శరవేగంగా అడుగులు

సింగపూర్ కంపెనీకి మాస్టర్ ప్లాన్ బాధ్యతలు?

బలగం టీవి, హైదరాబాద్

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి ఇటీవలఏ అక్కడ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనికితోడు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేస్తున్నారు. రానున్న ఆరేడేళ్లలో ఫ్యూచర్ సిటీని అందుబాటులోకి తీసుకుని రావడం లక్ష్యంగా శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికితోడు కొన్న ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే క్రమంలో ఫ్యూచటర్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ బాధ్యతలను సింగపూర్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించినట్లు తెలుస్తున్నది. ఇందుకోసం గ్లోబల్ టెండర్లను పిలువగా.. ఆరు సంస్థలు టెండర్లలో పాల్గొన్నాయి. అందులో సింగపూర్‌కు చెందిన డీపీ ఆర్కిటెక్ట్స్ అనే సంస్థ లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచిందని సమాచారం.దీంతో ఆ సంస్థకే మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించినట్లు సమాచారం. 765 చదరపు కిలోమీటర్ల మేర ఫ్యూచర్ సిటీకి ఆ సంస్థ మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నది. 9 నెలల్లో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి ఇచ్చేలా సంస్థకు బాధ్యతలు అప్పగించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. తొలిదశలో భాగంగా 30 వేల ఎకరాలపై మాస్టర్ ఎక్కి-లాన్‌ను సిద్ధం చేయనున్నారు. అందులో భాగంగా వేటికి ఎంత భూమి వినియోగించాలి.. మౌలికవసతుల అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యాలను ప్లాన్‌లో పొందుపరచ నున్నారు. మొత్తంగా 30 వేల ఎకరాల్లో 13 వేల ఎకరాలను మౌలికవసతులు, పారిశ్రామిక అవసరాల అభివృద్ధికి వాడుకోబోతున్నారు. డెవలప్‌మెంట్‌లో భాగంగా లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలుస్తున్నది. 13 వేల ఎకరాల్లో సింహభాగం లైఫ్?సైన్సెస్‌కు కేటాయించనున్నారు. 4 వేల ఎకరాల్లో లైఫ్‌సైన్సెస్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత 2,177 ఎకరాల్లోఎలక్ట్రానిక్స్ అండ్? అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్? జోన్‌ను అభివృద్ధి చేస్తారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు ట్రెండ్, డిమాండ్ పెరగడంతో దానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎనర్జీ పార్క్ కోసం దాదాపు 2 వేల ఎకరాలు కేటాయించినట్టు తెలిసింది. ఏఐ సిటీ కోసం 400 ఎకరాలు, డేటా సెంటర్ హబ్ కోసం 310 ఎకరాలు, హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ డిస్ట్రిక్ట్ కోసం 255 ఎకరాల కేటాయింపులు చేసినట్టు చెబుతున్నారు. వాటితోపాటు రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల అభివృద్ధి కోసం 2,477 ఎకరాలను కేటాయించారు. మిక్స్‌డ్‌యూజ్‌పర్పస్‌లో ఎంటర్‌టైన్‌మెంట్, స్పోర్ట్స్, ఫర్నీచర్? మాన్యుఫ్యాక్చరింగ్‌కు కూడా భూములు కేటాయించినట్టు చెబుతున్నారు. ట్రాన్స్‌పోర్ట్ కారిడార్లు, యుటిలిటీ నెట్‌వర్క్స్, సోషల్? ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాణిజ్య ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను మాస్టర్ ప్లాన్‌లో పొందు పరచనున్నారు. ప్రస్తుతం ఎఫ్?సీడీఏ ప్రాంతం వివిధ హద్దుల్లోకి వస్తున్నది. ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాలు హెచ్ఎండీఏ, మధ్యభాగంలో హైదరాబాద్ ఫార్మా సిటీ ఏరియా ఉంటున్నది. దక్షిణ భాగం గ్రామీణ ప్రాంతాలే ఉన్నాయని చెబుతున్నారు. ప్లాన్ ప్రకారం సిటీ అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికను పొందుపరుస్తారని అధికారులు చెబుతున్నారు.

ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. కేంద్రం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో మొక్కజొన్న సేకరణ చేపట్టిందన్నారు. జొన్న కొనుగోలుకు రూ.1100 కోట్లతో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొక్కజొన్న, జొన్నలను వెంటనే పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. పిఎస్ఎస్

స్కీంలో ఉన్న శన

రూ. 150 కోట్లతో శరవేగంగా రాజన్న అభివృద్ధి పనులు

బలగం టీవీ, వేములవాడ :

?వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు .వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం విస్తరణ, అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్న ఈవో రమాదేవి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస మాట్లాడుతూ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో దేవాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా మంత్రుల సమన్వయంతో ఆలయ రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. భక్తుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ, 150 కోట్ల రూపాయల వ్యయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

?ఆగమ శాస్త్ర నిపుణులు మరియు శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర నుంచి భద్రాచలం వరకు రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలన్నింటినీ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నారని, అందులో భాగంగానే రాజన్న క్షేత్ర అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఎప్పటికప్పుడు అధికారులను అడిగి తెలుసుకుంటున్నారని, పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

?ప్రస్తుతం మహా మండపం, అనిమిటి మండపం, బ్రాహ్మణ సత్రం, కోటి లింగాల నిర్మాణం మరియు ధర్మ గుండం వంటి పనులన్నీ ఏకకాలంలో ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు . ఆలయ అభివృద్ధి నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, భీమేశ్వర స్వామి వారి సన్నిధిలో దర్శన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా కోడెలను కట్టేసే సంస్కృతి ఉన్న ఈ పుణ్యక్షేత్రాన్ని, భవిష్యత్తులో భక్తులకు మరిన్ని మెరుగైన వసతులతో అందుబాటులోకి తీసుకువస్తామని, త్వరలోనే పనులు పూర్తి చేసి రాజన్న దర్శన భాగ్యాన్ని మరింత సులభతరం చేస్తామని అన్నారు.

లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 20న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న తమ కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి పి.నీరజ కోరారు.

?సోమవారం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లా న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మరియు పోలీసు అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా తక్కువ ఖర్చుతో, త్వరితగతిన మరియు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేసుల పరిష్కారంలో పోలీసు అధికారులు పోషించాల్సిన పాత్రపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

?ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, జిల్లా అదనపు ఎస్పీ డి.చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి పి.లక్ష్మణాచారి, వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల మరియు వేములవాడ డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జి కుమారి మేఘన, ఇతర పోలీసు అధికారులు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల కష్టాల్లో తోడుగా నిలిచిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం..

-బూరుగుపల్లిలో పరామర్శ, ఆర్థిక భరోసా

బలగం టీవీ,బోయినిపల్లి:

ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే చొప్పదండి ఎమ్మెల్యే మరియు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో సోమవారం విస్తృతంగా పర్యటించి, వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలను పరామర్శించి వారికి కొండంత అండగా నిలిచారు.

గ్రామ పర్యటనలో భాగంగా, క్యాన్సర్ వ్యాధితో మంచాన పడిన తాళ్లపల్లి లత దుస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే సత్యం వెంటనే ఆమె నివాసానికి చేరుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని , తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం తన సొంత నిధుల నుండి రూ. 10,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంతేకాకుండా, బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం తరపున మరో రూ. 50,000 సాయాన్ని త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం, ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి కోలుకుంటున్న పెంచాల సత్తయ్యను పరామర్శించి, వైద్య పరంగా ఎలాంటి సహాయం కావాలన్నా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే, కొద్ది రోజుల క్రితం మరణించిన నలిమెల రాజయ్య కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రాజయ్య చిన్న కుమారుడి అనారోగ్య సమస్యను కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అతనికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వ ఉన్నతాధికారులతో

మాట్లాడి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శివపారాశక్తి పీఠంలో ఘనంగా సోమావతి అమావాస్య వేడుకలు

అధికంగా పాల్గొన్న భక్తులు

భక్తి శ్రద్ధలతో శివయ్యకు పంచామృత, అన్నాభిషేకాలు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

సోమవారం, అమావాస్య సందర్భంగా అత్యంత పవిత్రమైన 'సోమావతి అమావాస్య' పర్వదినాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డి పేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని శివపారాశక్తి పీఠం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు భారీగా తరలివచ్చి భక్తి పారవశ్యంలో మునిగి పోయారు.ఈ సందర్భంగా పీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఈ సందర్భంగా స్వామివారికి విశేష పలు రకాల పళ్ళు,పుష్పాలతో , అభిషేకాలు,అన్న పూజలు శాస్త్రోక్తంగా, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు అయిన పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కెరలతో విశేష పంచామృతాభిషేకాలు జరిపారు. స్వామి వారికి అన్నాభిషేకం అమావాస్య తిథి ప్రత్యేకతను పురస్కరించుకుని పరమశివునికి అత్యంత భక్తిశ్రద్ధలతో 'అన్నాభిషేకం' నిర్వహించారు. స్వామివారి రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాలతో,శివనామస్మరణతో పీఠం ప్రాంగణం మారు మ్రోగింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు, మహిళలు పీఠం లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులందరూ "ఓం నమః శివాయ" అంటూ చేసిన శివనామస్మరణతో తన్మయత్వం పొందారు. విశేష సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారికి స్వహస్తాలతో అభిషేకాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తయిన అనంతరం, పీఠంకు విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

మోగిన బడి గంట

విద్యార్థులకు స్వాగతం పలికిన గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట :

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్ దాస్ పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా సంవత్సరం మొదటి రోజున విద్యార్థులు ఆనందోత్సాహాలతో బడికి వచ్చారు . వచ్చిన విద్యార్థుల కు పాఠశాల ఉపాధ్యాయులు , గ్రామ సర్పంచ్ ఎనగందుల నరసింహులు మరియు ప్రజాప్రతినిధులు విద్యార్థుల కు పుష్ప గుచ్ఛం ఇచ్చి పాఠశాల లోపలికి ఆహ్వానించారు.

కొత్త పలకలు, పెన్నులు, బలపాలు మరియు పుస్తకాలను విద్యార్థులకు పంచారు .పాఠశాల లో ఒక పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు తల్లిదండ్రుల తో మాట్లాడుతు ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ బడికే పంపించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలి అని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సూచనల ప్రకారం ప్రభుత్వ బడి నడుస్తది అలాగే తల్లిదండ్రుల సూచనలను పరిగణలోకి తీసుకొని వారి కి అనుగుణంగ బడి నడుస్తుంది అని తెలియజేసారు . ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నర్సింలు గారు ,ప్రజాప్రతినిధులు ఆంజనేయులు, సాయి కిరణ్ నాయక్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భట్టారి సంపత్ కుమార్,ఉపాధ్యాయులు తుమ్మనపల్లి నరేష్

,పంపరి రజిత,నీలిమా, రమ్యరజిని పాల్గొన్నారు.

శతాధిక (107) వృద్ధురాలు రామవ్వ మృతి..

బలగం టీవీ, ఇల్లంతకుంట:



ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు వెల్మ రామవ్వ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రామవ్వ చనిపోయేంత వరకు తన పని తానే చేసుకుందాని గ్రామంలో ప్రేమ ఆప్యాయలతతో మెదిలి అందరికి మార్గదర్శకంగా నిలిచిందని కొనియాడారు. రామవ్వ నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు సంతానం ఉన్నారు. మనుమల్లు మనుమరాల్లు తో బాహుబతకడం తో రామవ్వ అంత్యక్రియలకు జనాలు భారీగా తరలివచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి...

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

వేములవాడ పట్టణ శివారులోని జయవరం వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా రేకుర్తి గ్రామానికి చెందిన దానే రమేశ్ (30) తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం వేములవాడ శివారులోని జయవరం వద్ద అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని, ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలైన రమేశ్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొహరం ఏర్పాట్లు చేయాలి

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

మొహరం సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మొహరం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ..జిల్లాలోని అశూర్ ఖానాలలో పరిశుభ్రత పనులు చేయించాలని,

విద్యుత్ దీపాలు, నీరు అందుబాటులో పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా ఏర్పాట్లు చేయిశీచాలని పోలీసులకు సూచించారు.సమావేశంలో జిల్లా మైనారిటి సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి..

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఐడీఓసీ ప్రజావాణిలో డీఆర్ఓ జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

-ఎస్పీ మహేష్ బి.గితే.

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 24 ఫిర్యాదులను ఎస్పీ మహేష్ బి.గితే స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

చిగురుమామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

బలగం టీవీ, చిగురుమామిడి

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో సోమవారం చిగురుమామిడి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సందడిగా ప్రారంభమయ్యాయి. మండలంలోని 32 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం సుమారు 12 వేల పాఠ్యపుస్తకాలు, 20 వేల నోట్‌బుక్స్‌ను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చిగురుమామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ ఆకవరం భవాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ ఇర్షాద్, ఉపసర్పంచ్ విజయలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గొల్లపల్లి అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాన్సర్ తో పోరాడుతున్న మహిళ

ఆదుకోవాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

గత సంవత్సర కాలంగా మంచం పైనే ఉంటున్న వైనం

బలగం టీవీ, బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత క్యాన్సర్ తో మంచం పట్టి తీవ్రంగా ఇబ్బంది ఎదుర్కొంటోంది. గత సంవత్సర కాలంగా వివిధ ప్రైవేట్ ఆసుపత్రులలో తిరుగుతూ ఎన్నో ఇబ్బందులకు గురవుతూ కాలం వెళ్లదీస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. వారి కుటుంబం ప్రస్తుతం వైద్య ఖర్చులకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం గత ఆరు నెలలుగా వరంగల్ కు క్యాన్సర్ చికిత్స నిమిత్తం వెళ్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వీరి దయనీయ పరిస్థితిని చూసి, పలువురు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆర్థిక సహాయం చేసే వాళ్ళు వారి కుమారుడు తాళ్లపల్లి గణేష్ కు ఫోన్ పే నంబర్ 96766 96049 కు చేయగలరు.వ్యక్తిగతంగా కూడా వారి ఇంటికి వెళ్లి ఇవ్వగలరు అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తూ తెలిపారు.

మానాల కొత్త చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు..!

- ఐదు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్..

బలగం టీవీ, రుద్రంగి :

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని కొత్త చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు రుద్రంగి ఎస్సై మోతిరామ్ శనివారం రాత్రి సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.పోలీసులు నమోదు చేసిన వివరాల ప్రకారం జేసీబీ డ్రైవర్ మిర్యాల మనోజ్, యజమాని భూక్యా చందర్, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు తాటికొండ దీపక్, తాటికొండ శ్యామ్, లోలావత్ అర్జున్, లక్కాకుల స్వామి, తాటికొండ శ్రీనివాస్, అంగరకుల మహేష్, గుడిసె ప్రశాంత్‌లపై కేసులు నమోదు చేశారు.

ఈ సందర్భంగా ఎస్సై మోతిరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక వంటి ఖనిజాలను అక్రమంగా తరలించడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఇకపై ఎవరైనా అక్రమంగా మట్టి లేదా ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ తవ్వకాలు, రవాణాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్ర పటానికి పాలాభిషేకం

బలగం టీవీ, బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామ సర్పంచ్ గంగాధర కావ్య -లక్ష్మణ్ ఆధ్వర్యంలో కన్నం సుదర్శన్ చొప్పదండి ఎమ్మెల్యే ఉ కరీంనగర్ డిసిసి ప్రెసిడెంట్ మేడిపల్లి సత్యం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.దుబాయ్‌లో జరిగిన దురదృష్టకర ప్రమాదంలో జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పోవడం మనందరినీ కలచివేసింది.ఈ విషాద వార్త విన్న వెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎలాంటి ఆలస్యం చేయకుండా దుబాయ్‌కు చేరుకుని, అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. విదేశీ నేలపై బాధలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి కన్నీళ్లను తుడిచే ప్రయత్నం చేశారు. వారి బాధను తన బాధగా భావించి, నిజమైన నాయకత్వాన్ని చాటిచెప్పారు.ముఖ్యంగా, మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడం అనే క్లిష్టమైన ప్రక్రియను వేగవంతం చేయడానికి ఎంబసీ అధికారులతో సమన్వయం చేసి, ప్రతి దశలో చురుకుగా ముందుండి పనిచేశారు. బాధలో ఉన్న కుటుంబాలకు ధైర్యం నింపుతూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ఒక నిజమైన ప్రజానాయకుడిగా తన బాధ్యతను నిర్వర్తించారు. ఈ ఘటనలో ఆయన చూపిన మానవత్వం, సేవా తత్వం, స్పందన -- – నిజంగా అభినందనీయం. ఇలాంటి నాయకుడు మనకు ఉండటం గర్వకారణం. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోడిశేలా తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్ వంగపల్లి సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపిటిసి వంగపల్లి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అలువల ధర్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు ఉమెంతుల లక్ష్మరెడ్డినేరెళ్ల మునేందర్, గంగినేని కరుణాకర్, జాగిరి రమేష్, ఏముండ్ల రమేష్,తోడేటి చంటి,జాగిరి వెంకటేష్, గంగాధర కమలాకర్, కన్నం సుదర్శన్ మరియు ప్రజలు పాల్గొన్నారు.

చెట్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

జగిత్యాల కలెక్టర్‌కు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల వినతి

బలగం టీవీ, మెట్‌పల్లి

విద్యుత్ లైన్ల మరమ్మతులు, క్లియరెన్స్ పనుల సందర్భంగా చెట్లను విచక్షణారహితంగా నరికివేయకుండా సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యుత్ లైన్ల క్లియరెన్స్ పనుల్లో చెట్లను పూర్తిగా తొలగించడం, కొమ్మలను అధికంగా నరికివేయడం వల్ల పచ్చదనం తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణను కూడా బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన చోట్ల మాత్రమే చెట్ల కొమ్మలను కత్తిరించాలని, పూర్తిగా చెట్లను తొలగించకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ సమతుల్యత, స్వచ్ఛమైన గాలి, జీవ వైవిధ్యం, భూగర్భ జలాల పరిరక్షణలో చెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు పచ్చదన పరిరక్షణ కూడా సమాంతరంగా కొనసాగాలని అభిప్రాయపడ్డారు. చెట్ల తొలగింపు లేదా కొమ్మల కత్తిరింపు పనులు చేపట్టే ముందు అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, పర్యావరణానికి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. ఈ మేరకు సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే తెలంగాణ అభివృద్ధి..

-కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

బలగం టీవీ, వేములవాడ:

రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయి... అట్లనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుంది అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి బొల్లారం నుండి సిరికొండ వరకు రహదారి విస్తరణ పనులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ భూమి చేశారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద సుమారు రూ. 23 కోట్ల నిధులతో 18.21 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ, బలోపేతం పనులను చేపట్టామని ఈ పనులను ఆరు నెలల గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ రహదారి నిర్మాణం వల్ల మామిడిపల్లి, బావుసాయిపేట, రామన్నపల్లి, గోవిందరావుపేట తండా గ్రామాల ప్రజలకు, వాహనదారులకు ప్రయాణ సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులో రోడ్డు విస్తరణతో పాటు సీసీ డ్రైన్లు, పైప్ కల్వర్టులు, రోడ్డు భద్రతా చర్యలు కూడా చేపడుతున్నామని అన్నారు .గత ఏడేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కేంద్రం నుండి రూ. 22 వేల కోట్లకు పైగా నిధులను మంజూరు చేయించానని పేర్కొన్నారు. ఇందులో రహదారుల నిర్మాణం కోసమే రూ. 10 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని, జాతీయ రహదారుల విస్తరణకు ప్రత్యేకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించామని, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, జాతీయ ఉపాధి హామీ పథకాల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో ఏ ఎంపీ చేయనంత స్థాయిలో నిధులను తన నియోజకవర్గానికి తీసుకొచ్చానని అన్నారు.చొప్పదండి మండలం అర్నకొండ నుండి మల్యాల వరకు రూ. 50 కోట్లతో 35 కి.మీల మేర డబుల్ లేన్ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయని,అలాగే రూ. 2,147 కోట్లతో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి పనులు, రూ. 578 కోట్లతో ఎల్కతుర్తి–సిద్దిపేట రహదారి పనులు శరవేగంగా పూర్తవుతున్నాయని అన్నారు . కరీంనగర్–జగిత్యాల రోడ్డు విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా, రూ. 2,000 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసిందని,ఈ ప్రాజెక్టుల విషయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పూర్తి సహకారం అందిస్తున్నారని అభినందించారు.

గత ప్రభుత్వ మూర్ఖపు పాలన వల్ల తెలంగాణ ఎంతో నష్టపోయిందని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సహకరిస్తున్నందు వల్లే అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయని అన్నారు. ఎన్నికలు అయిపోయాయని, ఇప్పుడు తన ధ్యాస అంతా నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉందని అన్నారు . కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే విపక్ష లేకుండా, పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుంటూ కరీంనగర్ పార్లమెంట్‌ను దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.ఇక్కడ బీజేపీ నేతలు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో కేసీఆర్ ఫెయిల్..

-ప్రజా వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టండి

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

పదేళ్ల పాలనలో కేసీఆర్ ఫెయిల్ అయ్యారని, అందుకే ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సంక్షేమ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారురాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, కేటీఆర్ అనవసరంగా ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గత పదేళ్ల కేసీఆర్ పాలన పూర్తిగా విఫలమైందని, అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు .

ప్రస్తుత ప్రజా ప్రభుత్వం మొదటి అంకంలోనే బ్రహ్మాండమైన విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ అభ్యర్థులనే ప్రజలు గెలిపిస్తున్నారని, దీనిని బట్టి ప్రతిపక్షాలైన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు ప్రజలు ఇప్పటికే తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయని, కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు కూడా తెలంగాణ పథకాలను ప్రశంసిస్తుండటమే ఇందుకు నిదర్శనమని తెలిపారు.

అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందేలా కమిటీ సభ్యులు పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి..

- మానాలలో ఉమ్మడి గ్రామ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం..

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు.

- హాజరైన జువ్వాడి నర్సింగ్ రావు, మానాల మోహన్ రెడ్డి..

బలగం టీవీ, రుద్రంగి :

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన శక్తి అని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ఇ.యల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి మానాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జువ్వాడి నర్సింగ్ రావుతో పాటు రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తల పాత్ర కీలకమని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా పార్టీ ప్రచారానికి ముఖ్య వేదికగా మారిందని పేర్కొంటూ, కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొడుతూ కాంగ్రెస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండున్నర ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గతంలో అధిక విద్యుత్ బిల్లుల భారంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం అందుతోందని తెలిపారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఉమ్మడి మానాల గ్రామంలో ఇప్పటికే 92 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మరో 200 ఇళ్ల మంజూరు కోసం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

మానాల గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో కార్యకర్తలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్ జలపతి, జిల్లా కార్యదర్శి జక్కు మోహన్, మండల అధ్యక్షుడు గంగానర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డి, రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ, ఉపసర్పంచ్ దాసరి అశోక్, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ జక్కు వంశీ, రిటైర్డ్ ఏఈడీ లక్ష్మణ్ నాయక్, నూతన గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేములవాడ అభివృద్ధిపై కాంగ్రెస్ అబద్ధపు ప్రచారం..

-చల్మెడ లక్ష్మినర్సింహారావు

-వేములవాడలో విలేకరుల సమావేశం

బలగం టీవీ, వేములవాడ :

వేములవాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమ్మేళనం విజయవంతం కావడం చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శలకు దిగుతున్నారని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మినర్సింహారావు అన్నారు . వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో లక్ష్మినర్సింహారావు మాట్లాడుతూ శనివారం సమ్మేళనానికి వచ్చిన కార్యకర్తల భారీ సందోహాన్ని చూసి అధికార పార్టీకి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు.?ప్రాజెక్టుల విషయంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కనీస అవగాహన లేదని,ప్రాజెక్టులకు జీవం పోసింది కేసీఆర్ ప్రభుత్వమేనని, అప్పటి అభివృద్ధిని మరిచి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేస్తోందని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. ముఖ్యంగా కలికోట సూరమ్మ ప్రాజెక్టులో ఆరు మోటార్లు ఉన్నా ఒక్క చుక్క నీరు రావడం లేదని, దీనిపై ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ రాజకీయం పక్కన పెట్టి ప్రజలకు మేలు చేసే పనులపై దృష్టి సారించాలని సూచించారు.?రాజకీయ లబ్ధి కోసం గుడిని చెడగొడుతున్న ఘనత ఆది శ్రీనివాస్‌కే దక్కుతుందని,యాదాద్రిని ఎలా నిర్మించామో ఒకసారి వెళ్లి చూసి రావాలని, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించగా, ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిలిపివేసిందని ఆరోపించారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, ఆరు గ్యారెంటీలు పక్కన పడిపోయాయని అన్నారు . యువ వికాసం గ్యారెంటీ ఏమైందని, కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామన్న హామీ ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు.

?ఎమ్మెల్యే అసమర్థత వల్లే అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని చల్మెడ దుయ్యబట్టారు. 114 డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం నిలిచిపోయిందని, రుద్రంగి గ్రామంలో కళ్లల్లో వడ్ల నిల్వ ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని అన్నారు . సొంత గ్రామంలో 30 పడకల ఆసుపత్రిని కూడా పూర్తి చేయలేని ఎమ్మెల్యే, మేధావిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కంటెంట్ లేకుండా కేసీఆర్‌ను తిట్టడం మానుకోవాలని, మంత్రి పదవి కోసం ఆరాటపడుతున్న ఆది శ్రీనివాస్, ఆ పదవి దక్కించుకుని వేములవాడకు నిధులు తేవాలని తాము కోరుకుంటున్నామని, కానీ ప్రజలను మోసం చేయడం ఆపాలని అన్నారు . వేములవాడ అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని, కాంగ్రెస్ అభివృద్ధి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమని అన్నారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, సీనియర్ నాయకులు కందుల క్రాంతి కుమార్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, కొండ కనుకయ్య, నీలం శేఖర్, అంజద్ పాషా, మంత సందీప్, సుంకపాక రాజు, వెంకట్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాంబాబు, పెద్ది రాజు, పోతు అనిల్ కుమార్, సంజీవ్, హనుమంతు, ప్రేమ్ చారి, అసద్, లింగం రాకేష్, హరీష్, గోపి, సంతోష్, రావికంటి సాయి, సింగం ప్రసాద్, జీవన్ గౌడ్, నవీన్, శివ రెడ్డి తదితరులు ఉన్నారు.

అమ్మ ఫోన్ వస్తే ఎత్తాల్సిందే..

తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

అఫ్గానిస్థాన్‌తో తొలి వన్డే ముగిసిన అనంతరం జరిగిన ప్రెస్ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి రిపోర్టర్ల ప్రశ్నలకు సమాధానమిస్తుండగా.. అతడి తల్లి నుంచి ఫోన్ వచ్చింది. దాంతో ప్రెస్ మీట్‌ను కాసేపు ఆపిన నితీశ్.. 'అమ్మా.. 5 నిమిషాల్లో మళ్లీ చేస్తాను' అని తెలుగులో మాట్లాడి ఫోన్ కట్ చేశాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ధర్మశాల వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘన విజయం సాధించి.. సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే మ్యాచ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమిండియా యంగ్ ఆల్ రౌండర్, తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి పాల్గొన్నాడు. నితీశ్ విలేకరులతో మాట్లాడుతుండగా.. అతడి తల్లి ఫోన్ చేసింది. దీంతో ప్రెస్ మీట్ ఆపేసిన అతడు.. తల్లితో ఫోన్ మాట్లాడాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మీడియా సమావేశంలో రిపోర్టర్ల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న సమయంలో నితీశ్ కుమార్ రెడ్డి ఫోన్ మోగింది. అమ్మ నుంచి కాల్ వచ్చిందని గుర్తించిన అతడు.. ప్రెస్ మీట్‌ను కాసేపు ఆపి ఫోన్ లిఫ్ట్ చేశాడు. ఈ విషయాన్ని విలేకరులకు చెప్పాడు. 'అమ్మా.. 5 నిమిషాల్లో మళ్లీ చేస్తాను' అని తెలుగులో మాట్లాడి ఫోన్ కట్ చేశాడు. అనంతరం మీడియా ప్రతినిధులకు చిరునవ్వుతో సారీ చెప్పాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు.. నితీశ్ కుమార్ రెడ్డిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. . 'మన తెలుగును ప్రపంచ వేదికపై హైలైట్ చేస్తున్నాడు', 'నితీశ్‌కు అమ్మ అంటే ఎంత ప్రేమో..', 'అమ్మ నుంచి కాల్ వస్తే ఎత్తక తప్పదు మరీ' అని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. అఫ్గానిస్థాన్‌తో ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేను వర్షం కారణంగా.. 25 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ జట్టు 194 పరుగులకు ఆలౌటైంది. అరంగేట్రంలోనే గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబె తలో 3 వికెట్లతో సత్తాచాటారు. నితీశ్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం టీమిండియా 22.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్(84ఆ), కేఎల్ రాహుల్(39ఆ) రాణించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

వైభవ్ సూర్యవంశీ వెనుక ఆరేళ్ల కఠిన శ్రమ

బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్ లాస్ట్ రెండు సీజన్లలో తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచిన యంగ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ సక్సెస్ వెనుక ఆరేళ్ల కఠిన శ్రమ దాగి ఉంది. కేవలం 15 ఏళ్ల వయసులోనే వరల్డ్ క్రికెట్ మోస్ట్ ఎక్సైటింగ్ బ్యాటింగ్ సెన్సేషన్‌గా మారిన వైభవ్, రీసెంట్ ఐపీఎల్ సీజన్లలో 237 ప్లస్ స్ట్రైక్ రేట్‌తో 776 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ సూపర్ పర్ఫార్మెన్స్‌తో యూకే టూర్‌కు వెళ్లే ఇండియా టి20ఐ టీమ్‌కు సెలెక్ట్ అయ్యాడు. పాట్నాలోని తన అకాడమీలో ఎనిమిదేళ్ల వయసు నుంచి వైభవ్‌కు ట్రైనింగ్ ఇచ్చిన చైల్డ్‌హుడ్ కోచ్ మనీష్ ఓఝా అతని జర్నీ గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేశాడు. టెన్నిస్ బాల్ నుంచి హార్డ్‌బాల్ క్రికెట్‌కు మారినప్పటి నుంచి వైభవ్ రోజుకు కనీసం 600 బంతులు అంటే దాదాపు 100 ఓవర్లు ఫేస్ చేసేవాడని కోచ్ ఓఝా చెప్పాడు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నాన్‌స్టాప్‌గా ప్రాక్టీస్ సాగేది. ఫస్ట్ తానే స్వయంగా 200 నుంచి 300 బంతులు త్రోడౌన్స్ వేసేవాడినని, తాను అలసిపోతే సపోర్ట్ స్టాఫ్, వారు కూడా అలసిపోతే అకాడమీ బౌలర్లు వైభవ్‌కు బౌలింగ్ చేసేవారని తెలిపాడు. అందరూ అలసిపోయినా నెట్ సెషన్స్, బౌలింగ్ మెషిన్ల ద్వారా వైభవ్ తన బ్యాటింగ్ ప్రాక్టీస్ కంటిన్యూ చేసేవాడు. ఈ ఆరేళ్ల రిపీటెడ్ ట్రైనింగ్ వల్లే అతనిలో అద్భుతమైన మజిల్ మెమరీ, పవర్‌ఫుల్ బ్యాట్ స్వింగ్ క్రియేట్ అయ్యాయని విశ్లేషించాడు. సమస్తీపూర్ నుంచి రెండున్నర గంటల పాటు ట్రావెల్ చేసి వైభవ్ తన తండ్రి సంజీవ్‌తో కలిసి ఉదయం 5 గంటలకే పాట్నా అకాడమీకి వచ్చేవాడు. వైభవ్ కెరీర్ కోసం అతని పేరెంట్స్ ఎన్నో త్యాగాలు చేశారని కోచ్ గుర్తుచేసుకున్నాడు. వైభవ్ తల్లి ఆర్తి రోజు అర్ధరాత్రి 2 గంటలకే లేచి లంచ్ ప్రిపేర్ చేసేది. కేవలం వైభవ్, అతని తండ్రి కోసమే కాకుండా వారితో పాటు వచ్చే బౌలర్లు, అకాడమీలో పేద పిల్లల కోసం రోజు 10 నుంచి 15 మందికి సరిపోయే ఫుడ్ ప్యాక్ చేసి పంపేదని ఎమోషనల్ అయ్యాడు. పేరెంట్స్ ఫుల్ సపోర్ట్ వల్లే వైభవ్ ఈరోజు ఛాంపియన్ ప్లేయర్ అయ్యాడని స్పష్టం చేశాడు. వైభవ్ సూర్యవంశీ సక్సెస్ గ్రాఫ్ చూసిన తర్వాత ఇప్పుడు ఇండియా అంతటా పేరెంట్స్ తమ పిల్లలను క్రికెటర్లు చేయాలని డిసైడ్ అవుతున్నారు. ప్రస్తుతం ఐదేళ్ల చిన్న పిల్లలను కూడా అకాడమీకి తీసుకొస్తూ తమ బిడ్డను 'నెక్స్ట్ వైభవ్' లా మార్చాలని కోరుతున్నట్లు ఓఝా చెప్పాడు. వైభవ్ ఇప్పుడు ఇండియాలోని యంగ్ జనరేషన్‌కు ఒక రోల్ మోడల్, ఒక బిగ్ ఇన్‌స్పిరేషన్‌గా మారాడని సంతోషం వ్యక్తం చేశాడు. సరైన టెక్నికల్ పారామీటర్స్, కఠినమైన క్రమశిక్షణతో ఆడితే పాజిటివ్ రిజల్ట్ వస్తాయని వైభవ్ ప్రూవ్ చేశాడని కొనియాడాడు.

మైదానంలో చూసే కోహ్లీ.. బయట ఉండే కోహ్లీ

మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

బలగం టీవి, హైదరాబాద్

ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మీద ఉన్న ఒక బిగ్గెస్ట్ మిత్ (అపోహ) గురించి మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. కోహ్లీతో కలిసి చాలా ఏళ్లు ట్రావెల్ చేసిన శాస్త్రి, విరాట్ క్యారెక్టర్ గురించి ఓపెన్ అయ్యాడు. కోహ్లీ అహంకారి, గర్వంతో ఊగిపోతాడు, ఒక మొండి పిల్లాడిలా బిహేవ్ చేస్తాడు అని అందరూ అనుకుంటారు. శాస్త్రి మాటల ప్రకారం ఇదంతా నిజమే కావచ్చు కానీ, అది కేవలం క్రికెట్ గ్రౌండ్ వరకు మాత్రమే పరిమితం. ఫీల్డ్ బయట కోహ్లీ కంప్లీట్ డిఫరెంట్ పర్సన్ అని శాస్త్రి చెప్పాడు. మ్యాచ్ స్టార్ట్ అవ్వగానే అగ్రెసివ్ మోడ్‌లోకి వెళ్ళి, బయటకు రాగానే నార్మల్‌గా మారిపోయే ఆ స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్ క్వాలిటీ కోహ్లీలో తనకు చాలా ఇష్టమని వివరించాడు. న్యూజిలాండ్ బ్యాటింగ్ లెజెండ్ కేన్ విలియమ్సన్ ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో విరాట్ కోహ్లీ ఎమోషనల్ అయ్యాడు. వీరిద్దరి స్నేహం 2008 అండర్-19 వరల్డ్ కప్ నుంచి కొనసాగుతోంది. 16 ఏళ్ల కెరీర్‌లో కివీస్ టీమ్ తరపున 378 మ్యాచ్‌లు ఆడి ఎన్నో రికార్డులు క్రియేట్ చేసిన విలియమ్సన్‌ను క్రికెట్ వరల్డ్ మొత్తం గౌరవిస్తుంది. 2025లో టి20 ఇంటర్నేషనల్స్ నుంచి కూడా తప్పుకోవాలని కేన్ తీసుకున్న డెసిషన్ తర్వాత కోహ్లీ సోషల్ మీడియాలో స్పెషల్ మెసేజ్ పోస్ట్ చేశాడు. మైదానంలో ప్రత్యర్థిగా ఉన్నా, బయట మాత్రం తమ మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్ చాలా విలువైందని కోహ్లీ రాసుకొచ్చాడు. ఐపీఎల్‌లో కూడా కోహ్లీ, విలియమ్సన్ చాలా సార్లు పోటీ పడ్డారు. విలియమ్సన్ సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ టీమ్స్ కు ప్రాతినిధ్యం వహించగా, కోహ్లీ ఆర్సీబీ మెయిన్ ప్లేయర్‌గా ఉన్నాడు. "నీ బ్యాటింగ్ చూడటం, నీతో పోటీ పడటం నాకు ఎప్పుడూ ఒక ప్లెజర్. అంతకంటే ఎక్కువగా నీ స్నేహాన్ని, క్రికెట్ పై నీకు ఉన్న విజన్‌ను నేను గౌరవిస్తాను" అని కోహ్లీ చెప్పాడు. ఇప్పటి వరకు కేన్ క్రికెట్ కోసం తన వంతు కృషి చేశాడని, ఇకపై విశ్రాంతి తీసుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. జీవితం ఇప్పుడే మొదలైందని, అతనికి ఎప్పుడూ ఆల్ ది బెస్ట్ అని తన మిత్రుడికి ఫేర్‌వెల్ ఇచ్చాడు. రవిశాస్త్రి, కోహ్లీ కాంబినేషన్‌లో ఇండియా టీమ్ ఇంటర్నేషనల్ లెవెల్లో ఎన్నో విజయాలు సాధించింది. కోహ్లీ గ్రౌండ్ లో చూపే ఆ అగ్రెషన్ వెనుక టీమ్ గెలవాలనే తపన ఉంటుందని శాస్త్రి క్లారిటీ ఇచ్చాడు. ముఖ్యంగా స్లో పిచ్ ల మీద కూడా కోహ్లీ తన టెక్నిక్‌తో రన్స్ చేయగలడని కొనియాడాడు. క్రికెట్ క్లోజ్ టు హార్ట్ అని భావించే కోహ్లీ, ఆటను ఎప్పుడూ వదిలిపెట్టాలని అనుకోడని తెలిపాడు. ఇప్పుడు విలియమ్సన్ లాంటి మిత్రుడు తప్పుకోవడంతో కోహ్లీ కాస్త ఫీల్ అయినప్పటికీ, అతని గ్లోరియస్ కెరీర్ పట్ల సంతోషంగా ఉన్నట్లు స్పష్టం చేశాడు.

భారత్-ఏపై శ్రీలంక-ఏ జట్టు విజయం

సూపర్ ఓవర్‌లో శ్రీలంక ఏ జట్టు గెలుపు

బలగం టీవి, హైదరాబాద్

భారత్-ఎతో జరిగిన సూపర్ ఓవర్‌లో శ్రీలంక-ఎ విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య వన్డే మ్యాచ్ ఫలితం టై కావడంతో సూపర్ ఓవర్ పెట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 16/0 పరుగులు చేసింది. సహన్ అరాచ్చిగే 6లి, అవిష్క ఫెర్నాండో 9లి రన్స్ చేశారు. అనంతరం ఛేదనకు దిగిన భారత్ 10/0 పరుగులు మాత్రమే చేసింది. సూర్యాంశ్ 3లి, వైభవ్ సూర్యవంశీ 7లి రన్స్ చేశారు. టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ సిక్స్ హిట్టింగ్ సామర్థ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఐపీఎల్‌లో తన భారీ సిక్సర్లతో వరల్డ్ క్లాస్ బౌలర్లు అయిన జస్‌ప్రీత్ బుమ్రా, ప్యాట్ కమిన్స్, కగిసో రబడా, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్ వుడ్, భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ సిరాజ్‌లకు చుక్కలు చూపించాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో మొత్తం 72 సిక్స్‌లు బాది క్రిస్ గేల్ పేరిట ఉన్న 14 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. అలాంటి వైభవ్ సూర్యవంశీ తాజాగా ఒక్క సిక్స్ కొట్టలేక ఇబ్బంది పడ్డాడు. భారత్-ఏ ఓటమికి కారణమయ్యాడు. భారత్-ఏ జట్టులోనే డేంజరస్ హిట్టర్‌గా గుర్తింపు పొందిన వైభవ్ ఆపేరును నిలబెట్టుకోలేకపోయాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక-ఎతో సోమవారం జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో భారత్-ఏ సూపర్ ఓవర్‌లో 6 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో స్కోర్లు టై కావడంతో అంపైర్లు సూపర్ ఓవర్ ద్వారా ఫలితాన్ని తేల్చారు. అర్షద్ ఖాన్ వేసిన సూపర్ ఓవర్‌లో శ్రీలంక 16 పరుగులు చేసింది. అవిష్కా ఫెర్నాండో సిక్సర్ బాది భారీ స్కోర్ అందించాడు. నాలుగు బంతులు కట్టడిగా వేసిన అర్షద్ ఖాన్.. ఐదో బంతికి సిక్సర్ ఇచ్చుకున్నాడు. అనంతరం భారత్-ఏ సూపర్ ఓవర్‌లో 10 పరుగులే చేసి ఓటమిపాలైంది. వరుసగా మూడు బంతులాడిన సూర్యాన్ష్ షెడ్గే మూడు పరుగులే చేశాడు. ఒక్క బౌండరీ కొట్టలేకపోయాడు. చివరి మూడు బంతుల్లో వైభవ్ కూడా ఒక్క సిక్సర్ కూడా బాదలేకపోయాడు. ఒకే ఒక బౌండరీ బాదాడు. యాక్కర్లతో వైభవ్‌ను శ్రీలంక బౌలర్లు కట్టడి చేశారు. వరుసగా మూడు బంతుల్లో రెండు సిక్సర్లు, బౌండరీ కొట్టాల్సి రావడంతోనే వైభవ్ ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. సూపర్ ఓవర్‌లో స్ట్రైక్ వైభవ్ తీసుకోవాల్సిందని, తొలి మూడు బంతుల్లో ఒక్క సిక్సర్ వచ్చినా.. ఛేజింగ్ సులువయ్యేదని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. ఎలాంటి బంతినైనా బౌండరీకి తరలించే వైభవ్.. ఏమైందో ఏమో తెలియదు కానీ శ్రీలంకలో తడబడుతున్నాడు. ఈ మ్యాచ్‌లో ఓడినా.. కీలక సమయంలో వైభవ్ బ్యాట్ నుంచి ఒక్క సిక్సర్ రాకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ ఏ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. సూర్యాన్ష్ షెడ్గే(66 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72), విప్రజ్ నిగమ్(49 బంతుల్లో 6 ఫోర్లతో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(21), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(11), రుతురాజ్ గైక్వాడ్(37), తిలక్ వర్మ(23), ఆయుష్ బదోని(15), నిషాంత్ సింధు(6) దారుణంగా విఫలమయ్యారు. శ్రీలంక ఏ బౌలర్లలో మహమ్మద్ షిరాజ్(3/33), విజయ్‌కాంత్(3/26) మూడేసి వికెట్లు తీయగా.. సహాన్, వనుజ సహాన్, మతులన్ తలో వికెట్ తీసారు. అనంతరం శ్రీలంక-ఏ కూడా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 265 పరుగులే చేసింది. సదీర సమరవిక్రమా(113 బంతుల్లో 7 ఫోర్లతో 93) తృటిలో శతకం చేజార్చుకోగా.. నిరోషన్ డిక్‌వెల్లా(37), వానుజ సాహన్(25) పర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో ఆయుష్ బదోని 2 వికెట్లు తీయగా.. అర్షద్ ఖాన్, నిషాంత్ సింధు, విప్రజ్ నిగమ్, అనుకూల్ రాయ్, సూర్యాన్ష్ షెడ్గే తలో వికెట్ తీసారు.

రేపు భారత జట్ల మూడు కీలక మ్యాచ్‌లు!

బలగం టీవి, హైదరాబాద్

క్రికెట్ అభిమానులకు జూన్ 17 ప్రత్యేకమైన రోజుగా మారనుంది. ఒకే రోజున భారత సీనియర్ జట్టు, ఇండియా-ఎ జట్టు, భారత మహిళల జట్టు కీలక మ్యాచ్‌లు ఆడనున్నాయి. తిలక్ వర్మ నేతృత్వంలోని ఇండియా-ఎ జట్టు, శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని సీనియర్ జట్టు, మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు వరుసగా బరిలోకి దిగనున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు క్రికెట్ అభిమానులకు పండుగ వాతావరణం నెలకొననుంది.భారత క్రికెట్ అభిమానులకు జూన్ 17 ప్రత్యేకమైన రోజుగా నిలవబోతోంది. సాధారణంగా ఒకే రోజున ఒక భారత జట్టు మ్యాచ్ ఆడటం చూస్తుంటాం. కానీ ఈసారి సీనియర్ పురుషుల జట్టు, ఇండియా-ఎ జట్టు, మహిళల జట్టు వరుసగా బరిలోకి దిగనున్నాయి. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు 12 గంటలకు పైగా భారత క్రికెట్ అభిమానులు టీవీలు, మొబైల్ స్క్రీన్‌లకు అతుక్కుపోయే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రత్యేక రోజున మూడు వేర్వేరు స్థాయిల్లో భారత జట్టు కీలక పోరాటాలకు సిద్ధమవుతున్నాయి. యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించే ఇండియా-ఎ జట్టు మ్యాచ్‌తో రోజు ప్రారంభమవుతుంది. అనంతరం సీనియర్ జట్టు వన్డే సిరీస్‌లో కీలక మ్యాచ్ ఆడనుండగా, రాత్రికి మహిళల జట్టు టీ20 ప్రపంచకప్ పోరులో పాల్గొంటుంది. ఉదయం 10 గంటలకు ఇండియా-ఎ జట్టు అఫ్గానిస్థాన్-ఎతో తలపడనుంది. ప్రస్తుతం జరుగుతున్న త్రైపాక్షిక టోర్నీలో ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్న తిలక్ వర్మకు ఇది మరో పరీక్షగా మారనుంది. ఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో మంచి ప్రదర్శన అవసరం కావొచ్చని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. యువ ప్రతిభను అంచనా వేయాలనుకునే అభిమానుల దృష్టి ఈ మ్యాచ్‌పై ఉండనుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు భారత సీనియర్ జట్టు అఫ్గానిస్థాన్‌తో వన్డే మ్యాచ్ ఆడనుంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని జట్టు ఇప్పటికే సిరీస్‌లో ఆధిక్యం సాధించిన నేపథ్యంలో ఈ మ్యాచ్ విజయం ద్వారా సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల యువ ఆటగాళ్లు, కొత్త కాంబినేషన్లతో ప్రయోగాలు చేస్తున్న భారత జట్టు మరోసారి తన బలాన్ని చాటుకునేందుకు సిద్ధమవుతోంది. ఇక రాత్రి 7 గంటలకు మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు బరిలోకి దిగనుంది. నెదర్లాండ్స్‌తో జరిగే ఈ మ్యాచ్‌లో విజయం సాధించి టోర్నీలో తమ జోరును కొనసాగించాలని భారత మహిళలు భావిస్తున్నారు. గత మ్యాచ్‌లో సాధించిన విజయంతో ఉత్సాహంగా ఉన్న జట్టు, తదుపరి కీలక పోరాటాలకు ముందు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుకోవాలని చూస్తోంది. ఒకే రోజున మూడు భారత జట్టు వేర్వేరు టోర్నీల్లో, వేర్వేరు ఫార్మాట్లలో ఆడటం చాలా అరుదుగా జరుగుతుంది. అందుకే జూన్ 17ను భారత క్రికెట్ అభిమానులు ప్రత్యేకంగా ఎదురు చూస్తున్నారు. యువ ఆటగాళ్ల ప్రతిభ, సీనియర్ జట్టు ప్రదర్శన, మహిళల జట్టు విజయయాత్ర.. ఇలా మూడు రకాల క్రికెట్ అనుభవాలను ఒకే రోజులో ఆస్వాదించే అవకాశం అభిమానులకు లభించనుంది.

ఏబీ డివిలియర్స్ రికార్డ్‌ను బద్దలకొట్టిన చాహల్

బలగం టీవి, హైదరాబాద్

టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ బంతితోనే కాకుండా బ్యాట్‌తో కూడా అద్భుతాలు చేయగలనని నిరూపించాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ విసిరిన వినూత్న బ్యాటింగ్ ఛాలెంజ్‌ను స్వీకరించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. సాధారణంగా తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థులను కట్టడి చేసే చహల్.. ఈసారి బ్యాట్‌తో బంతిని బౌండరీ బయటకు పంపించాడు. కేవలం 50 బంతుల్లోనే 100 పరుగులు చేయాలని, బౌలింగ్ గంటకు 81 కిలోమీటర్ల వేగంతో మొదలై.. ప్రతీ బంతికి ఒక మైలు చొప్పున పెరుగుతుందని పీటర్సన్ సవాల్ విసిరాడు. అంతేకాకుంబా బౌండరీ దూరాన్ని 40 మీటర్లకు తగ్గించాడు. ఈ వినూత్న నిబంధనలతో సాగిన ఈ పోరు ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తించింది.తొలి బంతికే సిక్సర్ బాదిన చాహల్.. రెండో బంతిని కూడా సిక్సర్ తరలించాడు. అయితే మూడో బంతికి క్యాచ్ ఇవ్వగా ఫీల్డర్ వదిలేసాడు. ఈ అవకాశంతో చాహల్ చెలరేగాడు. అతని షాట్లకు పీటర్సన్ అవాక్కయ్యాడు. 8వ బంతికి చాహల్ ఔటైనప్పటికీ.. రూల్స్ ప్రకారం ఔటైనప్పుడు తిరిగి బ్యాటింగ్ చేసేందుకు అతని స్కోర్ నుంచి ఐదు పరుగులు తగ్గించారు. దాంతో చాహల్ స్కోర్ 26 పరుగులకు పడిపోయింది. 10 బంతులు ముగిసే సరికి చాహల్ 33 పరుగులు చేశాడు. ఆ తర్వాత దూకుడుగా ఆడిన చాహల్ 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ హాఫ్ సెంచరీని చాహల్ తనదైన శైలిలో సెలెబ్రేట్ చేసుకున్నాడు. పీటర్సన్ సైతం అతన్ని కౌగిలించుకొని అభినందించాడు. ఆ తర్వాత 16వ బంతికి మరో సిక్సర్ కొట్టే ప్రయత్నంలో చహల్ అవుటయ్యారు. దీనితో మరొక ఐదు పరుగులు కోల్పోవాల్సి వచ్చింది. 20వ బంతి ముగిసే సమయానికి చహల్ స్కోరు 56 పరుగుల వద్ద ఉంది. ఆ తర్వాత వరుస సిక్సర్లతో విరుచుకుపడి కేవలం 25 బంతుల్లోనే 90 పరుగుల మార్కును అందుకున్నాడు. చివరకు 29వ బంతిని ఆకాశమే హద్దుగా సిక్సర్ బాదిన చహల్ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న పాత రికార్డును చహల్ అధిగమించాడు. ఈ సవాలును పూర్తి చేయడానికి చహల్ ఏకంగా 17 సిక్సర్లు కొట్టాడు. ఇంకా 21 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించాడు. ఈ సరదా సవాల్‌ను చాహల్ గెలిచినప్పటికీ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో అతను తీవ్రంగా నిరాశపర్చాడు. 12 ఇన్నింగ్స్‌లో కేవలం 12 వికెట్లు మాత్రమే తీసాడు. పంజాబ్ కింగ్స్ తరపున రెండు సీజన్లు ఆడిన చాహల్ మొత్తం 28 వికెట్లు తీసాడు. ఈ సీజన్‌లో అతని వైఫల్యం పంజాబ్ ప్లే ఆఫ్స్ అవకాశాలను దెబ్బతీసింది.భారత జట్టు తరపున చాహల్ 2023లో చివరి మ్యాచ్ ఆడాడు. యువ స్పిన్నర్లు బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేస్తుండటంతో చాహల్‌కు అవకాశం లేకుండా పోయింది. భారత జట్టుకు దూరమైన చాహల్.. కౌంటీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్ ఆడటం ద్వారా తన బౌలింగ్‌ను మెరుగుపర్చుకోవచ్చనే యోచనలో చాహల్ ఉన్నాడు.

.....

బ్రెజిల్ రికార్డును బద్దలుకొట్టిన జర్మనీ

బలగం టీవి, హైదరాబాద్

2026 ఫిఫా వరల్డ్?కప్?లో మరో రికార్డ్ నమోదైంది. టోర్నీలో అత్యుత్తమ జట్లలో ఒకటైన జర్మనీ, ఐదుసార్లు ఛాంపియన్?గా నిలిచిన బ్రెజిల్ రికార్డ్?ను బద్దలు కొట్టింది. తాజాగా కురసావ్?పై జరిగిన మ్యాచ్?లోనే జర్మనీ ఆ అద్భుతమైన ఘనత సాధించింది. దీంతో ఫిఫాలో ప్రస్తుతం ఆ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. టెక్సాస్ వేదికగా తాజాగా పసికూన కురసావ్?తో జర్మనీ తలపడింది. ఈ మ్యాచ్?లో ఆ జట్టుపై జర్మనీ 7- 1 భారీ తేడాతో విజయం సాధించి ఫిఫా 2026లో శుభారంభం చేసింది. అయితే ఈ మ్యాచ్?లో ఒకటి కాదు రెండు కాదు.. జర్మనీ ఏకంగా ఏడు గోల్స్ చేయడం విశేషం. ఈ క్రమంలోనే ఫిఫా వరల్డ్?కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా జర్మనీ రికార్డు కొట్టింది. ఇదివరకు ఈ రికార్డు బ్రెజిల్? పేరిట ఉంది. ఆ జట్టు ఇప్పటిదాకా 238 గోల్స్ చేసింది. ఈ మ్యాచ్?కు ముందు జర్మనీ ఖాతాలో 232 గోల్స్ ఉండేవి. అయితే కురసావ్?పై ఆధిపత్యం ప్రదర్శించిన జర్మనీ రికార్డు స్థాయిలో ఏడుసార్లు బంతిని గోల్?లోకి పంపింది. దీంతో 239 గోల్స్?లో ఫిఫా హిస్టరీలో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా కొనసాగుతోంది. ఫిఫా వరల్డ్?కప్? చరిత్రలో బ్రెజిల్, జర్మనీ దేనికి అదే సాటి! ఈ టోర్నీలో ఇవి అత్యుత్తమ జట్లు. బ్రెజిల్ రికార్డు స్థాయిలో ఇప్పటిదాకా ఐదుసార్లు ఛాంపియన్ (1958, 1962, 1970, 1994, 2002)గా నిలిచింది. మరోవైపు జర్మనీ సైతం అంతే బలమైన జట్టు. ఆ టీమ్ ఇప్పటిదా నాలుగుసార్లు (1954, 1974, 1990, 2014) ట్రైటిల్ దక్కించుకుంది. ప్రస్తుతం బ్రెజిల్-జర్మనీ మధ్య గోల్స్ తేడా కేవలం ఒకే ఒక్కటి. పైగా ఈ టోర్నీలో బ్రెజిల్ ఇంకా రెండు మ్యాచ్?లు ఆడాల్సి ఉంది. దీంతో రాబోయే మ్యాచ్?ల్లో ఎన్ని గోల్స్ చేస్తుంది? మళ్లీ తమ పాప్ పొజిషన్?ను తిరిగి దక్కించుకుంటుందా? అనేది ఆసక్తికరం. మరోవైపు, జర్మనీ కూడా ఇంకా రెండు గేమ్?లు ఆడనుంది. ఇప్పటికే టాప్ ప్లేస్ దక్కింది. ఆ పొజిషన్?ను నిలబెట్టుకోవాలని జర్మనీ కూడా నిలడగా రాణిస్తుందనడంలో సందేహం లేదు. కాగా, ఈ మ్యాచ్?లో కురసావోపై జర్మనీ 7-1 తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఏడు లేదా అంత

సంక్రాంతికి వెంకటేశ్, కళ్యాణ్ రామ్ కాంబో

ప్లాన్ చేస్తున్న అనిల్ రావిపూడి

బలగం టీవి, హైదరాబాద్

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఆయన సినిమాలకు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాల తర్వాత అనిల్ రావిపూడి ఇప్పుడు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఓ క్రేజీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌తో 'ఎఫ్2', 'ఎఫ్3' వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన అనిల్, కళ్యాణ్ రామ్‌తో తన తొలి చిత్రం 'పటాస్' ద్వారా సూపర్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే సినిమాలో చూపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయని సమాచారం. పూర్తి స్థాయి యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ఎక్స్‌క్లూజివ్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా టైటిల్‌కు సంబంధించి ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పండుగ వాతావరణం, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీకి సరిపోయేలా ఈ చిత్రానికి 'సంక్రాంతి సరుకు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ టైటిల్ మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సింగ్ గీతం' గోల్డెన్ బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ చిత్ర విజయోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, నిర్మాత నాగ్ అశ్విన్‌పై ప్రశంసలు కురిపించారు. సాధారణంగా మేము ట్రైలర్లు, ప్రమోషన్లతో సినిమాపై హైప్ క్రియేట్ చేయడానికి చాలా కష్టపడతాం. కానీ నాగ్ అశ్విన్ మాత్రం ట్రైలర్ లేకుండానే సినిమాను విడుదల చేసి విజయం సాధించారు. ఆ ఫార్ములా నాకు బాగా నచ్చింది. ఇకపై నా సినిమాలకు కూడా ట్రైలర్లు కట్ చేయను అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

కరుప్పు విజయంతో మరింత బిజీగా త్రిష

రెమ్యునరేషన్ కూడా పెంచినట్లు టాక్

బలగం టీవి, హైదరాబాద్

సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ బిజీ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతిసారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత

బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్పు చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడుతున్నాయి. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి.

కర్నూలులో నాగబంధం యూనిట్ సందడి

బలగం టీవి, హైదరాబాద్

కర్నూలు నగరంలో నాగబంధం చిత్ర బృందం సందడి చేసింది. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద అనంత పద్మనాభ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఈ సినిమా ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హీరో విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు పాల్గొన్నారు. సినిమా ప్రమోషన్స్‌ను కర్నూలు నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందని సినీనటులు తెలిపారు. యువతకు పురాణ కథలు, దేవాలయాల గురించి సినిమాలో చూపించామన్నారు. జులై 3వ తేదీన ఈ చిత్రం విడుదలవుతుందని, అందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు వద్ద హీరోయిన్ డ్యాన్స్‌తో సందడి చేశారు.

నాగార్జునతో చేతులు కలపనున్న అనిల్..!

బలగం టీవి, హైదరాబాద్

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు సిద్ధమవుతున్నాడని, తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు చూస్తే అక్కినేని నాగార్జునతో సినిమా దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అనిల్ రావిపూడి తన కెరీర్‌లో ఇప్పటికే పలువురు అగ్ర హీరోలతో కలిసి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించారు. ముఖ్యంగా సీనియర్ స్టార్ హీరోలైన మెగాస్టార్ చిరంజీవి, నటసింహం బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్‌లతో సినిమాలు చేసి విజయాలు సాధించారు. దీంతో టాలీవుడ్‌లో ఒకే తరం నలుగురు అగ్ర హీరోలతో పనిచేసే అరుదైన అవకాశానికి ఆయన మరింత చేరువయ్యారు. గతంలో నాగార్జున-అనిల్ రావిపూడి కాంబినేషన్‌పై అనేక వార్తలు వచ్చినప్పటికీ అవి ప్రచారాలుగానే మిగిలిపోయాయి. అయితే తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు మరోసారి ఈ కాంబినేషన్‌ను వార్తల్లోకి తెచ్చాయి. ఒక షో ప్రమోషన్స్ సందర్భంగా సీనియర్ నటి రాధ మాట్లాడుతూ,నేను చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలతో సినిమాలు చేశాను అని చెప్పగా, వెంటనే స్పందించిన అనిల్ రావిపూడి చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లతో తాను చేసిన సినిమాల పేర్లను ప్రస్తావించారు. అనంతరం 'నాగార్జున గారితో మనం త్వరలో తీయబోతున్నాం' అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ మాటలే ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. తాజా సమాచారం ప్రకారం, నాగార్జున 101వ చిత్రాన్ని అనిల్ రావిపూడి దర్శకత్వం వహించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఈ సినిమాను 2028 సంక్రాంతి కానుకగా విడుదల చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

సల్మాన్‌తో రాజ్ నిడుమోరు చిత్రం

బలగం టీవి, హైదరాబాద్

'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' వంటి సూపర్ హిట్ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ నిడిమోరు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ సినిమాకు సిద్ధమవుతున్నారు. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో రాజ్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ ఇప్పుడే మొదలైంది, అది ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మరో సిరీస్ కూడా అభివృద్ధి దశలో ఉంది. మా హిందీ సినిమా నిర్మాణం త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను దృష్టిలోపెట్టుకొని, భారీ బడ్జెట్‌తో ఈ సూపర్ సినిమా రూపొందిస్తున్నారు. అక్టోబర్‌లో ఈ షెడ్యూల్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తారని సమాచారం. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలోనూ ఈ సినిమా గురించి వార్తలు ప్రచారమయ్యాయి. ఈ చిత్రంలో రాజ్ భార్య సమంత హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అయితే, వాటిని రాజ్ సన్నిహిత వర్గాలు కొట్టిపారేశాయి. ఇక, సల్మాన్ ప్రస్తుతం దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్‌రాజు కాంబినేషన్‌లో వస్తున్న మూవీలో షెడ్యూల్‌లో బిజీగా ఉన్నారు.

పెద్ది కలెక్షన్ల దూకుడు

బలగం టీవి, హైదరాబాద్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. మొదటి వారం తర్వాత వీకెండ్‌లో కొంత మందగించిన కలెక్షన్లు, రెండో వీకెండ్‌లో మళ్లీ ఊపందుకోవడం విశేషం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, విడుదలైన 11వ రోజు ఆదివారం 'పెద్ది' మరోసారి బలమైన ప్రదర్శన కనబరిచింది. దేశవ్యాప్తంగా సుమారు 4,133 షోల ద్వారా రూ.9.20 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించినట్లు సమాచారం. దీంతో భారతీయ బాక్సాఫీస్ వద్ద 11 రోజుల్లో ఈ చిత్రం రూ.216 కోట్ల నెట్, రూ.256.23 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' మంచి స్పందనను అందుకుంటోంది. విదేశీ మార్కెట్లలో ఇప్పటివరకు సుమారు రూ.51.75 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ రిపోర్ట్ చెబుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం రూ.307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లను తన ఖాతాలో వేసుకున్నట్లు సమాచారం. మరోవైపు చిత్ర బృందం మాత్రం మొత్తం వసూళ్లు రూ.393 కోట్లకు చేరుకున్నాయని ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు రూ.195.30 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదైనట్లు సమాచారం. ఇది సినిమా విజయానికి కీలకంగా మారిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

రెండో వీకెండ్‌లో కలెక్షన్లు మళ్లీ జోరందుకోవడంతో 'పెద్ది' మరిన్ని రికార్డుల దిశగా పయనిస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఫుల్ రన్ ముగిసే నాటికి రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

శ్రీలంక ఆటగాళ్లతో వైభవ్ సూర్యవంశీ కొట్లాట!

బలగం టీవి, హైదరాబాద్

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ సహనం కోల్పోయాడు. శ్రీలంక ఏ ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా దంబుల్లా వేదికగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. సూపర్ ఓవర్‌కు దారి తీసిన ఈ మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌తో పాటు సూపర్ ఓవర్‌లోనూ వైభవ్ సూర్యవంశీ విఫలమయ్యాడు. సూపర్ ఓవర్ ముగిసిన అనంతరం శ్రీలంక ప్లేయర్లపైకి వైభవ్ సూర్యవంశీ కోపంగా దూసుకెళ్లాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. శ్రీలంక టీమ్‌లోని ఓ ఫీల్డర్.. వైభవ్ సూర్యవంశీని ఏదో అనడంతో అతను తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. శ్రీలంక వికెట్ కీపర్ డిక్‌వెల్లా వారిని శాంతింపజేశారు. ఆ తర్వాతా వైభవ్ లంక ఆటగాళ్లను కోపంగా చూస్తూ.. ఏదో అంటూ పెవిలియన్‌కు వెళ్లారు. అయితే కాసేపటికి ఇరు జట్లు షేక్‌హ్యాండ్స్ ఇచ్చుకున్నాయి. అర్షద్ ఖాన్ వేసిన సూపర్ ఓవర్‌లో శ్రీలంక 16 పరుగులు చేసింది. అవిష్కా ఫెర్నాండో సిక్సర్ బాది భారీ స్కోర్ అందించాడు. నాలుగు బంతులు కట్టడిగా వేసిన అర్షద్ ఖాన్.. ఐదో బంతికి సిక్సర్ ఇచ్చుకున్నాడు. అనంతరం భారత్-ఏ సూపర్ ఓవర్‌లో 10 పరుగులే చేసి ఓటమిపాలైంది. వరుసగా మూడు బంతులాడిన సూర్యాన్ష్ షెడ్గే మూడు పరుగులే చేశాడు. ఒక్క బౌండరీ కొట్టలేకపోయాడు. చివరి మూడు బంతుల్లో వైభవ్ కూడా ఒక్క సిక్సర్ కూడా బాదలేకపోయాడు. ఒకే ఒక బౌండరీ బాదాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ ఏ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. సూర్యాన్ష్ షెడ్గే(66 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72), విప్రజ్ నిగమ్(49 బంతుల్లో 6 ఫోర్లతో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(21), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(11), రుతురాజ్ గైక్వాడ్(37), తిలక్ వర్మ(23), ఆయుష్ బదోని(15), నిషాంత్ సింధు(6) దారుణంగా విఫలమయ్యారు. శ్రీలంక ఏ బౌలర్లలో మహమ్మద్ షిరాజ్(3/33), విజయ్‌కాంత్(3/26) మూడేసి వికెట్లు తీయగా.. సహాన్, వనుజ సహన్, మతులన్ తలో వికెట్ తీసారు. అనంతరం శ్రీలంక-ఏ కూడా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 265 పరుగులే చేసింది. సదీర సమరవిక్రమా(113 బంతుల్లో 7 ఫోర్లతో 93) తృటిలో శతకం చేజార్చుకోగా.. నిరోషన్ డిక్‌వెల్లా(37), వానుజ సాహన్(25) పర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో ఆయుష్ బదోని 2 వికెట్లు తీయగా.. అర్షద్ ఖాన్, నిషాంత్ సింధు, విప్రజ్ నిగమ్, అనుకూల్ రాయ్, సూర్యాన్ష్ షెడ్గే తలో వికెట్ తీసారు.

వివాహ వార్షికోత్సవంలో పిల్ల చేతులతో పోస్ట్

ఉపాసన పోస్ట్‌తో అభిమానుల్లో ఆనందం

బలగం టీవి, హైదరాబాద్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌కు ప్రస్తుతం డబుల్ సెలబ్రేషన్స్ నడుస్తున్నాయి. ఒకవైపు ఆయన నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తుండగా, మరోవైపు జూన్ 14న రామ్ చరణ్-ఉపాసన దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. దీంతో మెగా అభిమానుల్లో ఆనందం రెట్టింపైంది.అయితే రామ్ చరణ్, ఉపాసన దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షల వర్షం కురిపించారు. 2012 జూన్ 14న వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, టాలీవుడ్‌లో అత్యంత అభిమానించబడే సెలబ్రిటీ కపుల్స్‌లో ఒకరిగా నిలిచింది.

ఈ ప్రత్యేక సందర్భంగా ఉపాసన కొణిదెల సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ అభిమానులను భావోద్వేగానికి గురి చేసింది. తమ ముగ్గురు పిల్లల చిన్న చేతులను చూపిస్తూ ఓ అందమైన ఫోటోను ఆమె పంచుకున్నారు. కుటుంబ బంధాలను ప్రతిబింబించే ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది. ఇప్పటికే రామ్ చరణ్-ఉపాసన దంపతులకు కుమార్తె క్లింకార ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల వారి కుటుంబంలోకి కవల పిల్లలు కూడా చేరడంతో ఆనందం మరింత పెరిగింది. తాజా ఫోటోలో ముగ్గురు చిన్నారుల చేతులు కనిపించడంతో అభిమానులు మురిసిపోతున్నారు. 'పెద్ది' విజయం, ఇటు వివాహ వార్షికోత్సవం, కుటుంబ ఆనందాలు.. ఇలా అన్ని శుభ పరిణామాలు ఒకేసారి రావడంతో రామ్ చరణ్ కుటుంబంలో ప్రస్తుతం పండుగ వాతావరణం నెలకొంది. ఉపాసన షేర్ చేసిన ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది.

ఏఐ వీడియో వైరల్!

హై-వోల్టేజ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 171 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. వరుస వికెట్లు కోల్పోతూ కేవలం 106 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత మహిళల జట్టు పాకిస్థాన్‌పై ఘన విజయాన్ని నమోదు చేసి టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. అయితే ప్రస్తుతం ఈ మ్యాచ్‌కు సంబంధించిన వీడియో అంటూ ఒకటి వైరల్ అవుతుంది. మ్యాచ్ మధ్యలో పాకిస్తాన్ బౌలర్.. భారత బ్యాటర్ మీదకు దూసుకెళ్లడం.. అదే సమయంలో భారత ప్లేయర్ పాక్ ప్లేయర్ గొంతు పట్టుకోవడం చకచకా జరిగిపోతాయి. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా అయిన ఎక్స్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతుంది. అయితే ఇది నిజమైన వీడియో కాదు. ఏఐతో సృష్టించిన వీడియో. భారత్, పాకిస్తాన్ మహిళల జట్ల మధ్య జరిగిన పోరులో ఇటువంటి సంఘటన అస్సలు చోటుచేసుకోలేదు. ఈ వీడియోను క్షణ్ణంగా పరిశీలిస్తే మీకు కూడా అర్థం అవుతుంది. మొదట మైదానంలో ఇద్దరు భారత బ్యాటర్లే కనిపిస్తారు. అనంతరం ముగ్గురు బ్యాటర్లు కనిపిస్తారు. ప్రస్తుతం బై రన్నర్ నిబంధన లేదు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో బ్యాటింగ్‌కు చెందిన జట్టు నుంచి కేవలం ఇద్దరు బ్యాటర్లు మాత్రమే మైదానంలో ఉంటారు. కానీ, ఇక్కడ భారత్ నుంచి ముగ్గురు బ్యాటర్లు గ్రౌండ్‌లో కనిపిస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత రోజురోజుకూ సరికొత్త పుంతలు తొక్కుతోంది. సరదా కోసం క్రియేట్ చేసే డీప్‌ఫేక్ వీడియోలు ఫర్వాలేదు కానీ.. కొన్నిసార్లు రెండు దేశాల మధ్య, క్రీడాకారుల మధ్య లేనిపోని భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఇవి తయారవుతుండటం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. తాజాగా మహిళల ప్రపంచ కప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరు దేశాల ప్లేయర్లు మైదానంలో తీవ్రంగా గొడవ పడినట్లు, ఒకరిపైకి ఒకరు దూసుకెళ్లినట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అయితే, ఈ వీడియోపై క్రీడా విశ్లేషకులు, ఫ్యాక్ట్ చెక్ టీమ్స్ స్పందించాయి. వాస్తవానికి భారత్-పాక్ మ్యాచ్‌లో ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటుచేసుకోలేదని, నెట్టింట సర్క్యులేట్ అవుతున్న ఆ వీడియో కేవలం ఏఐతో సృష్టించిన నకిలీ వీడియో అని తేల్చారు.